## కార్యకర్తలకు అండగా మాజీ ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర, డిసెంబర్ 4 : నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. 15 రోజుల కిందట బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త సోషల్ మీడియా వారియర్ ఎండీ ఖాజామైనొద్దీన్ అలియస్ అజ్జు గుండె పోటుతో మృతి చెందారు. కార్యకర్తకు టుంబాన్ని ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. దీంతో ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికలో ఓడిన సోమవారం సాయంత్రం మృతుడి కుటుంబ సభ్యులను కలిసి మాజీ ఎమ్మెల్యే తన సొంత నిధులతో రూ.5లక్షల చెక్కును అందజేశారు. ఎన్నికల కోడ్ ఉన్నందుకు సాయం చేయలేకపోయామని తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా చెప్పారు. ఆయన వెంట ఎంపీపీ రమాదేవి, ముడా డైరెక్టర్ కర్ణం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ వెంకటేశ్, మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, శ్రీకాంత్ యాదవ్, బాలరాజు, కొండశ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకట్రాములు, యుగేందర్‌రెడ్డి, రాధాకృష్ణ, సయ్యద్ జక్కి పాల్గొన్నారు.

## రైలు కిందపడి పడి వృద్ధురాలి మృతి

దేవరకద్ర, డిసెంబర్ 4 : దేవరకద్ర పట్టణ సమీపంలో గుర్తు తెలియని ఓ వృద్ధురాలు రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ తెలిపారు. పట్టణ సమీపంలోని ఎస్సీ వాడలో ఉన్న ఎస్సీ హాస్టల్ వెనుకల సోమవారం గుర్తు తెలియని వృద్ధురాలు (65) రైల్వే పట్టాలపై పడి ఉండడంతో స్థానికుల పోలీసులకు తెలపడంతో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించామన్నారు. మృతదేహన్ని ఎవరైనా గుర్తిస్తే జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో తెలపలన్నారు.

## బ్రోచర్ ఆవిష్కరణ

పాలమూరు, డిసెంబర్ 4 : జిల్లా ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అండ్ సైన్స్ విద్యావిభాగం ఆధ్వర్యంలో డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ అనే అంశంపై 2024 జనవరి 20వ తేదీన ఒక్క రోజు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ.లక్ష్మీకాంత్‌రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజామంగతాయారు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ ఇది ఒక టెక్నాలజీ, మార్పులు వంటి గురించి వివరించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అధ్యాపకులు, విద్యావంతులు జనవరి 15, 2024లోగా సమర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వరి, సురయ్య, జబీన్, శ్రీనివాసులు, రఘువీర్ గుప్తా, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

# ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

నవాబ్‌పేట, డిసెంబర్ 4 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని చౌడూర్, గురుకుంట, లింగంపల్లి, లోకిరేవు, కాకర్లపహాడ్, నవాబ్‌పేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళా సంఘాల సభ్యులు వరిధాన్యం కొనుగోలు చేస్తున్నారు. నాలుగైదు రోజులుగా ఆయా కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని పెద్ద ఎత్తున తీసుకువస్తున్నట్లు వెలుగు ఏపీఎం జీవరత్నం తెలిపారు. లింగంపల్లిలో 2,036 బ్యాగులు, చౌడూర్‌లో 1,877 బ్యాగులు, గురుకుంటలో 3,090 బస్తాల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. మిగతా కేంద్రాలకు కూడా ధాన్యం వస్తోందని వివరించారు. రైతుల ధాన్యానికి ఏ గ్రేడ్ రూ.2, 203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 ధర చెల్లిస్తుండడంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రా లకు ధాన్యం తీసుకువస్తున్నట్లు తెలిపారు. కొనుగో లు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. వర్షం కారణంగా ధాన్యం తడిచి పోకుండా టార్పాలిన్ కవర్లు, గన్నీ బ్యాగులు ఏర్పాటు చేశామన్నారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



లింగంపల్లిలో ధాన్యాన్ని తూకం చేస్తున్న సభ్యులు

## అంతర్జాతీయ క్రీడలకు ఎంపికైన విద్యార్థినికి అభినందనలు

పాలమూరు, డిసెంబర్ 4 : మహబూబ్‌నగర్ ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం బీజెడ్‌సీ చదువుతున్న విద్యార్థిని మస్రత్ ఉన్నీస నేపాల్ దేశ రాజధాని అయిన ఖాట్మాండ్‌లో జరగబోయే అంతర్జాతీయ టార్గెట్‌బాల్ ప్రెసిడెంట్‌కప్ 2023–24 పోటీలకు ఎంపికైన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సత్యభాస్కర్‌రెడ్డి ప్రత్యేకంగా శాలువాతో సన్మాంచి అభినందించారు. ఈ విద్యార్థి డిసెంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం విద్యార్థికి అభినందనలు తెలిపారు. అనంతరం ఈ క్రీడా పోటీల్లో మంచిగా రాణించి కళాశాలకు మంచి పేరు తేవాలని గుర్తు చేశారు.



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి

## చోరీ చేశారు.. పట్టుబడ్డారు..

గద్వాల అర్బన్, డిసెంబర్ 4 : ముగ్గురు మహిళలు బ్యాంక్‌లో పట్టపగలే చోరీ చేసి.. పట్టుబడిన సంఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. గద్వాల టౌన్ ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న బ్యాంక్‌లో డబ్బులు జమ చేసేందుకు గద్వాల పట్టణానికి చెందిన నవీన్ తన బ్యాగ్‌లో నగదును తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హీనా, సునేనా, బీనాబాయి.. డబ్బులున్న బ్యాగు పై నిఘా పెట్టారు. బ్యాంక్‌లో నవీన్ క్యూలైన్‌లో నిలిచి ఉండగా బ్యాగ్‌ను బ్లేడ్‌తో కోసి నగదును చోరీ చేసి పారిపోయేందుకు ప్రయత్నించారు. బ్యాగ్ కదలడంతో అనుమానం వచ్చిన నవీన్ దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి స్థానికుల సా యంతో ముగ్గురు మహిళలను పట్టుకొని పోలీసులను అప్పజెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మహిళలపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మూసాపేట(అడ్డాకుల), డిసెంబర్ 4 : దక్షణ కాశిగా పేరుగాంచిన కందూరు రామలింగేశ్వర స్వామి ఆలయానికి సోమవారం భక్తుల తాకిడి పెరిగింది. కార్తీక సోమవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మొదటగా స్వా మి వారి కోనేరులో కొందరు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో స్వామి వారికి పూజలు చేశారు. కోయిలకొండ, మండలంలోని ఆచార్యపూర్ వీరభద్రస్వామి ఆలయంలో కార్తీ క సోమవారం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# జడ్చర్ల డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద గందరగోళం

- ఇల్లు దక్కదేమోనన్న అభద్రతా భావంతో ఇండ్లలోకి ప్రవేశించేందుకు యత్నం

జడ్చర్లటౌన్, డిసెంబర్ 4 : పట్టణంలోని ఎర్రగుట్ట వద్ద పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద సోమవారం గందరగోళం నెలకొన్నది. గూడు లేని పేదలకు ఇల్లు కేటాయించాలనే సదుద్దేశంతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ కనబరిచి పేదల కోసం జడ్చర్ల పట్టణంలో మొత్తం 1,453 ఇండ్ల నిర్మించారు. ఇందులో భాగంగా ఎర్రగుట్ట వద్ద జీప్లస్–2 పద్ధతిన 560, బోయలకుంటలో 120, కావేరమ్మపేటలో 120, డీటీసీ వద్ద 500 ఇండ్లు, పెద్దగుట్ట వద్ద 48, హరిజనవాడలో 48, మాధవరావు కంపౌండ్‌లో 8, దళితవాడలో 12, కాటన్‌మార్కెట్ సమీపంలో జర్నలిస్టులకు 40 ఇండ్లను నిర్మింపజేయించి అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ క్రమంలో అర్హులైన వారికే ఇండ్లు కేటాయించాలని అధికారుల చేత పకడ్బందీగా సర్వే చేయించి పలు ప్రాంతాల్లో లబ్ధిదారులకు పట్టా సర్టిఫికెట్లు ఇచ్చి డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేశారు. అదేవిధంగా ఎర్రగుట్ట వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను పేదలకు పంపిణీ చేసే క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో రావడంతో పంపిణీ కార్యక్రమం నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఎన్నికల పరిణామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మారెడ్డి ఓటమి చెందడంతో ఇక తమకు కేటాయిస్తామన్న డబుల్ బెడ్రూం ఇండ్లు తమకు దక్కవన్న అభద్రతభావంతో కొందరు సోమవారం ఎర్రగుట్ట వద్ద ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లలోకి వెళ్లేందుకు యత్నించారు. డబుల్ బెడ్రూం ఇండ్లకు అధికారులు వేసిన తాళాలను విరగొట్టి లోపలికెళ్లేందుకు యత్నించారు. ఒక్కసారిగా పట్టణంలోని పలు కాలనీల నుంచి పేదలు డబుల్ బెడ్రూం ఇండ్ల వద్దకు తరలిరావడంతో గందరగోళం నెలకొన్నది. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని అక్కడొచ్చిన వారితో మాట్లాడారు. డబుల్ బెడ్రూంలకు సంబంధించి అర్హులైన వారికి అధికారులు పట్టా సర్టిఫికెట్లు ఇస్తారని, పట్టా సర్టిఫికెట్ లేకుండా డబుల్ బెడ్రూం ఇండ్లలోకి వెళ్లొద్దని పోలీసులు సర్దిచెప్పి వెనక్కి పంపించారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేదల కోసం డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించారు. కానీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. మళ్లీ కొత్త లిస్టులు తయారు చేసి కొత్త వారికి ఇస్తారేమో అభద్రతాభావంతో ఇక్కడి వచ్చామంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇల్లు దొరకదేమో అన్న ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించి అర్హులైన వారికి తొందరగా డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



డబుల్ బెడ్రూం ఇండ్ల వద్దకు చేరుకున్న జనం

## ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 4 : జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం అండర్–17 ఉమ్మడి జిల్లా బాల, బాలికల అథ్లెటిక్స్ జట్ల ఎంపికలను నిర్వహించారు. ఎంపికలను ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడా కోటలో ఉద్యోగ అవకాశలు లభిస్తాయన్నారు. జిల్లాలో అథ్లెటిక్స్ క్రీడలో ఎంతో మంది రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించారని గుర్తుచేశారు. రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి పతకాలు సాధించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యప్రకాశ్, వేణుగోపాల్, పరశురాం, బాలరాజు, ఆనంద్‌కుమార్, నిరంజన్‌రావు, శ్రీనివాసులు, ఉమాదేవి, అంజనమ్మ, ప్రసన్న, శ్రీను, జగదీశ్ పాల్గొన్నారు.

## ఆసియా టార్గెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని సత్కరిస్తున్న ఎస్సై నాయకులు

కోయిలకొండ, డిసెంబర్ 4 : మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఎన్.కృష్ణ అంతర్జాతీయ ఆసియా టార్గెట్ పోటీలకు ఎంపిక కావడంపై ఎస్సై విజయ భాస్కర్, సర్పంచ్ కృష్ణయ్య అభినందించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో క్రీడాపోటీలకు ఎంపికైన కృష్ణను శాలువాతో సత్కరించారు. కోయిలకొండలో చదువుతున్న విద్యార్థి అంతర్జాతీయ క్రీడాపోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని కొనియాడారు. నేపాల్‌లోని ఖాట్మాండులో జరిగే పోటీలో కృష్ణ పాల్గొంటారని పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ ఖాజా, నాయకులు రాజు, నాజీమ్, మోహిన్, రవి, రాఘువేంద్ర పాల్గొన్నారు.

## పీయూలో ఎంపికలు

పాలమూరు, డిసెంబర్ 4 : పాలమూరు విశ్వవిద్యాలయంలో సోమవారం ఆల్ ఇండియా అథ్లెటిక్స్, ఆర్చరీ, హండ్‌బాల్ సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఎంపికలు ఈనెల 7, 8వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పీయూ పీడీ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ ఎంపికల్లో 5కేఎం, 10కేఎంతోపాటు త్రోయింగ్, జంపింగ్ ఉంటాయన్నారు. అదే విధంగా 8వ తేదీన హ్యాండ్‌బాల్ విభాగంలో పురుషుల సెలక్షన్ ఉంటుందని, అందులో 100మీటర్లు, 200మీటర్లు, 400మీటర్లు, 800మీటర్లు, 1500మీటర్లుల్లో స్త్రీ, పురుషులకు ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ఎంపికలో ఎంపికైన వారు టీఎన్‌పీఈఎస్ యూనివర్సిటీ చెన్నై, గురు కాశి యూనివర్సిటీ పంజాబ్‌లో జరుగు టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు.

## కొత్తకోట ఫలితాలు ఇవే ..

కొత్తకోట, డిసెంబర్ 4 : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదివారం వెలువడిన ఎన్నికల ఫలితాలు మండలంలోని గ్రామాల వారీగా ఫలితాలు ఇలా ఉన్నాయి. మండల వ్యాప్తంగా కాంగ్రెస్‌కు అధిక్యం ఇచ్చింది. అందులో కొత్తకోట పట్టణంలో కాంగ్రెస్ పార్టీకి 6,087ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 5,436ఓట్లు, కనిమెట్టలో కాంగ్రెస్‌కు 905, బీఆర్‌ఎస్‌కు 1,163, పాలెంలో కాంగ్రెస్‌కు 1,063, బీఆర్‌ఎస్‌కు 1,078, నిర్వేన్ కాంగ్రెస్‌కు 296, బీఆర్‌ఎస్‌కు 542, రామానంతపురం కాంగ్రెస్‌కు 412, బీఆర్‌ఎస్‌కు 379, కానాయపల్లి కాంగ్రెస్‌కు 1,147, బీఆర్‌ఎస్‌కు 1,032, సంకిరెడ్డిపల్లి కాంగ్రెస్‌కు 795, బీఆర్‌ఎస్‌కు 568, ఈదులాయితండా కాంగ్రెస్ 181, బీఆర్‌ఎస్‌కు 114, రాయినిపేట కాంగ్రెస్‌కు 1,096, బీఆర్‌ఎస్‌కు 410, అమడబాకుల కాంగ్రెస్‌కు 840, బీఆర్‌ఎస్‌కు 774, సత్యహళ్లి కాంగ్రెస్‌కు 178, బీఆర్‌ఎస్‌కు 167, వడ్డెవాట కాంగ్రెస్‌కు 643, బీఆర్‌ఎస్‌కు 706, చర్లపల్లి కాంగ్రెస్‌కు 682, బీఆర్‌ఎస్‌కు 311, ముమ్మళ్లపల్లి కాంగ్రెస్‌కు 642, బీఆర్‌ఎస్‌కు 348, భూత్పూర్ కాంగ్రెస్ 282, బీఆర్‌ఎస్ 268, అప్పరాల కాంగ్రెస్‌కు 1,165, బీఆర్‌ఎస్‌కు 744, రామకిష్టాపురం కాంగ్రెస్‌కు 556, బీఆర్‌ఎస్‌కు 686, పామాపురం కాంగ్రెస్‌కు 881, బీఆర్‌ఎస్‌కు 605, నాటవెల్లి కాంగ్రెస్‌కు 448, బీఆర్‌ఎస్‌కు 412, నాటవెల్లి పెద్దతండా కాంగ్రెస్‌కు 358, బీఆర్‌ఎస్‌కు 419, మీరాసిపల్లి కాంగ్రెస్‌కు 803, బీఆర్‌ఎస్‌కు 561, విలియంకొండ కాంగ్రెస్‌కు 242, బీఆర్‌ఎస్‌కు 256, నాచారంపేట కాంగ్రెస్‌కు 170, బీఆర్‌ఎస్ 205, మొత్తం కాంగ్రెస్‌కు 19,912 ఓట్లు రాగా బీఆర్‌ఎస్‌కు 17,184 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ పార్టీకి 2,728 ఓట్లు లీడ్ వచ్చింది.

## ముడా డైరెక్టర్ పదవికి రాజీనామా

జడ్చర్ల, డిసెంబర్ 4 : జడ్చర్ల మున్సిపాలిటీకి చెందిన ముడా డైరెక్టర్ వై.జీ.ప్రీతం మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(ముడా) డైరెక్టర్ పదవికి సోమవారం రాజీనామా చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే పదవికి జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఓటమి చెందడం పట్ల మనస్తాపానికి గురై తన పదవికి రాజీనామా చేసినట్లు ప్రీతం తెలిపారు. తన రాజీనామ పత్రాన్ని ముడా కార్యాలయంలోని ఇన్‌వార్డులో, కలెక్టర్ కార్యాలయంలోని ఇన్‌వార్డులో అందజేసినట్లు తెలిపారు.

## కార్యకర్తలు అధైర్యపడొద్దు

నవాబ్‌పేట, డిసెంబర్ 4 : బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గెలిచినప్పుడు పొంగిపోలేదని, ఓడినప్పుడు కుంగి పోమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల హామీలను నమ్మి ప్రజలు ఓటు వేశారని, వారి ఆశలు అడియాశలు చేయకుండా.. ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరారు.